క్లుప్తంగా

ఏటి గంగమ్మకు బోనాలు



ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో ఆదివారం గంగపుత్రులు ఏటి గంగమ్మకు బోనాలు సమర్పించారు. భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా కుందూనదికి చేరుకొని అక్కడ గంగమ్మ, పోతురాజు ప్రతిమలను తయారు చేసి ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి సంవత్సరం వేడుకగా మత్స్యకారులు గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ అని వారు తెలిపారు.

నిండుకుండల్లా ఫాంపాండ్స్



డబ్ల్యూ.గోవిందిన్నె సమీపంలో కళకళలాడుతున్న కుంట

దొర్నిపాడు: ఇటీవల కురిసిన వర్షాలకు ఫాంపాండ్స్ జలకళను సంతరించుకున్నాయి. వర్షపునీటితో నిండు కుండలను తలపిస్తున్నాయి. భూగర్భజలాలు పెంపొందించేడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 50కి పైగా ఫాంపాండ్స్‌ను తవ్వారు. వీటిల్లో వర్షపు నీరు చేరడంతో పొలం పనుల్లో భాగంగా రైతులకు ఈ నీరు ఎంతగానో ఉపయోగ పడతుంది.

లోక కల్యాణార్థం గాయత్రి హోమం



హోమంలో పాల్గొన్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక టెక్కెలోని భరత మాత దేవాలయం వీధిలో వెలసిన యోగా చైతన్య కేంద్రంలో ఆదివారం లోక కల్యాణార్థం గాయత్రి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సెక్రటరీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ హోమాలు చేయడం వల్ల వాతావరణం కాలుష్యం తగ్గిపోయి వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. రామకృష్ణారెడ్డి, డాక్టర్ సహదేవుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూర్ణాహుతి గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వర్షం కోసం గ్రామ దేవతలకు పూజలు



పెద్దమ్మ, గంగమ్మకు బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో వర్షం కోసం గ్రామ దేవతలైన పెద్దమ్మ, గంగమ్మకు ఆదివారం బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎంపీటీసీ వెంకటరాముడు దంపతులు పెద్దమ్మకు గండ దీపంతో వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని భక్తులు బిందెలతో గంగమ్మకు జలాభిషేకం చేసి పూజలు చేశారు. ఎంపీపీ వీరభద్రుడు, శేషు రమేష్, సుబ్బారాయుడు, అబ్దుల్ రహిమాన్ తదితరులున్నారు.

పశువుల ఎరువుతో లాభాలు అధికం



దొర్నిపాడు పొలాల్లో పశువుల ఎరువు తోలి ఉంచిన దృశ్యం

దొర్నిపాడు: ప్రస్తుత ఖరీఫ్‌లో రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. దీంతో రైతులు ఇప్పటికే పశువుల ఎరువును పొలాల్లో చల్లేందుకు తోలి ఉంచారు. సేంద్రియ ఎరువులు ఉపయోగించడం వల్ల నేల స్వభావం దెబ్బతినదని, నాణ్యమైన, అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామ పంచాయతీ మజరా గ్రామమైన చక్రవర్తులపల్లెలోని వివాదాస్పద రోడ్డు స్థలాన్ని ఎంపీపీ వీరభద్రుడు, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్ ఆదివారం పరిశీలించారు. గ్రామం చివరలో దొంక సమీపంలో కొనేళ్లుగా వివాదస్పదంగా ఉన్న రోడ్డును వారు పరిశీలించారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని కొందరు గ్రామస్తులు ఎంపీపీ దృష్టికి తీసుకురావడంతో పనులు చేపట్టడానికి గల సౌకర్యాలను పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి స్థలం ఇరుకుగా ఉందని రోడ్డుకు ఇరువైపుల నివాసం ఉన్న వారు సహకరించి కొంత స్థలాన్ని వదిలితే ఇరువైపులా డ్రైనేజీ కాలువలు నిర్మించి, సీసీ రోడ్డు వేస్తామని ఎంపీపీ చెప్పారు.

అమ్మపాలు..అమృతం

- పుట్టిన అరగంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టాలి
- ముర్రుపాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపు



గోస్పాడులో తల్లిపాలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గోస్పాడు: అమ్మపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శిశువు ఆకలి తీరడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఎన్నో పోషకాలు ఉన్న తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతల్లో అవగాహన కల్పించేందుకు మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను ఏటా ఆగస్టు నెలలో నిర్వహిస్తున్నారు. వారోత్సవాలు చేపట్టి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ప్రయోజనాలు ఎన్నో..

పుట్టిన అర గంటలోపు తల్లిపాలు తాపించడం వల్ల శిశువుకు చాలా ప్రయోజనాలు ఉన్నాయి. కొందరు బిడ్డ పుట్టిన రెండు మూడు రోజుల వరకు తల్లి పాలను ఇవ్వడం లేదు. పాశ్చాత్య సంస్కృతిలో కొందరు, పట్టణాల్లో నివసించేవారు, బిజీ లైఫ్‌తో మరి కొందరు బిడ్డకు పాలు ఇవ్వడం లేదు. ఇలాంటి చర్యల వల్ల పిల్లలతో పాటు తాము నష్టపోతున్నామనే విషయాన్ని తల్లులు గ్రహించలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో తల్లి పాలలో ఉండే పోషకాలు, బిడ్డ ఎదుగుదలపై చూపే ప్రభావంపై చైతన్యం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ముఖ్యంగా ముర్రు పాలు తాపడం ద్వారా బిడ్డలో వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుంది. బిడ్డకు తల్లిపాలివ్వడం ద్వారా భవిష్యత్‌లో రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఉపయోగాలు..

- ముర్రుపాలలో శిశువు జీర్ణాశయ అభివృద్ధికి దోహదపడే పదార్థాలు, విటమిన్ ఏ ఉంటుంది.
- మొదటి ఆరు నెలలు డబ్బా పాలు పట్టించకుండా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి.
- సాధారణ ప్రసవం అయితే పుట్టిన అరగంటలోపు, సిజేరియన్ అయితే 4గంటల్లోపు తల్లిపాలు ఇవ్వాలి.
- తల్లిపాలు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు జ్ఞాపకశక్తి పెంపొందుతుంది.
- బిడ్డకు పాలు ఇచ్చే మహిళల్లో బ్రెస్ట్, అండాశయ క్యాన్సర్లు, రక్తహీనత, ఎముకల బలహీనత, తదితర వ్యాధుల నుంచి రక్షణ పొందే అవకాశం ఉంది.
- పసిబిడ్డకు ప్రధాన శత్రువు చలి. బిడ్డను ఒడిలో ఉంచుకొని పాలు ఇవ్వడం ద్వారా తల్లి శరీరం నుంచి శిశువుకు అవసరమైన వేడి అందుతుంది. తల్లి, బిడ్డ మధ్య అనుబంధం పెరుగుతుంది.

బిడ్డకు ముర్రుపాలే ఆరోగ్యం



శిశువుకు ముర్రుపాలతో ఆరోగ్యం చేకూరుతుంది. నవజాత శిశువుకు ముర్రుపాలు పట్టించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఎన్నో వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం ద్వారా ఆమె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. తల్లిపాల విషయంలో అపోహలు వీడి బిడ్డ సంరక్షణకు ముర్రుపాలు తాపించాలి. తద్వారా బిడ్డకు ఇన్‌ఫెక్షన్‌లు రాకుండా పోషకాహార లోపం లేకుండా ఉంటుంది.

–డాక్టర్ గోపాల్, వైద్యాధికారి, గోస్పాడు

వ్యవసాయ విద్యుత్ వేళలు

గోస్పాడు: మండలంలో రైతులకు 9గంటల పాటు నిరంతర విద్యుత్ అందిస్తున్నట్లు విద్యుత్ ఏఈ జ్ఞానసూర్యుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెండు గ్రూపులుగా విభజించి వారం పాటు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఏ గ్రూపులో ఒంటివెలగల ఫీడర్ కింద యాళ్లూరు సబ్ స్టేషన్ పరిధిలో ఎం.కృష్ణాపురం, యాళ్లూరు ఫీడర్ల కింద, దీబగుంట్ల సబ్ స్టేషన్ పరిధిలో చెన్నూరు, నాగులవరం, దీబగుంట్ల ఫీడర్ల కింద ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. బి గ్రూపులో ఎం.చింతకుంట్ల, యాళ్లూరు ఫీడర్ కింద సత్యనారాయణాపురం, దీబగుంట్ల ఫీడర్ కింద మసీదుపురం, మోతుకుల పల్లె గ్రామాలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

పుంగనూరు ఘటనకు బాధ్యుడు చంద్రబాబే



శ్రీనివాస సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల: పుంగనూరులో జరిగిన దహనకాండకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడే బాధ్యుడని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం పుంగనూరులో టీడీపీ నాయకులు సృష్టించిన దమనకాండకు ఆదివారం పట్టణంలో కార్యకర్తలు, నాయకులు నిరసన తెలిపారు. పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, రాష్ట్ర డైరెక్టర్లు సునిత అమృతరాజ్, చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు అధికారం చేజిక్కించుకునేందుకు కుయుక్తులు పన్నుతూ, పోలీసులపైకి తన మూకలను పురిగొల్పడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి దుర్మార్గమైన చర్యలను ప్రజలు ఎన్నటికీ క్షమించరని, రానున్న కాలంలో మరోమారు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. పుంగనూరులో టీడీపీ చేసిన దహనకాండను దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ ఖండించకుండా వంత పాడుతున్నారన్నారు. ఇటువంటి అసాంఘిక చర్యలు పవన్ కల్యాణ్‌కు కనిపించవా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు అనిల్‌అమృతరాజ్, గన్నికరీం, జాకీర్‌హుసేన్, కిరణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, విజయభాస్కర్, చంద్రశేఖర్, రమణ, దేవనగర్‌బాషా, కలాం పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ క్రీడాభివృద్ధికి కృషి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): షూటింగ్ బాల్ క్రీడను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఏపీ పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో నంద్యాల జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ బాలబాలికల జట్లు ఎంపిక పోటీలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు ఆధ్వర్యంలో ఎంపికైన జట్టు ఈనెల 12, 13 తేదీల్లో నెల్లూరు పట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున పాల్గొంటుందని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు దివాకర్, ఏపీ పీఈటీ అసోసియేషన్ నంద్యాల సెక్రటరీ రవికుమార్, కిరణ్‌కుమార్, నంద్యాల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



మహదేవపురంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

శిరివెళ్ల: మహదేవపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1990–2000 సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని సంతోషంగా గడిపారు. నాడు తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. హెచ్‌ఎం రమణారెడ్డి, సర్పంచు పెద్ది రమణయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చాగలమర్రి: స్నేహితుల దినోత్సవం సందర్భంగా మండలంలోని చిన్నవంగలి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1992లో 7వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. కార్యక్రమానికి కర్నూలు, కడప, నంద్యాల, బెంగళూరు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వారు కలుసుకొని నాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. చాలా సంవత్సరాల తరువాత అందరూ ఒకే చోట కలవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అనంతరం విందులో పాల్గొన్నారు.



చిన్నవంగలిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రార్థనకు వెళ్తూ పరలోకానికి..

బొమ్మలసత్రం: నంద్యాల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. బండి ఆత్మకూరు మండలం పరమటూరు గ్రామానికి చెందిన ఏసుదర్శనం (73) కార్పెంటర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఏసు దర్శనం ఆదివారం రైతునగరం సమీపంలోని చర్చికి కుటుంబీకులతో కలసి ఆటోలో బయలుదేరారు. నంద్యాల పట్టణంలోని నూనెపల్లి బ్రిడ్జిపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలేరో ట్రాలీ వాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న ఏసుదర్శనం తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించేలోగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అయితే సచివాలయాల పరిధిలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను మండల కేంద్రంలో జరిగే స్పందన కార్యక్రమానికి హాజరై అర్జీలు అందజేయాలని కోరారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

నంద్యాల(అర్బన్): నంద్యాలకు చెందిన చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కౌన్సిలర్ వాసగిరి విజయభాస్కర్ ఆధ్వర్యంలో గోస్పాడు, సోమయాజులపల్లె, గాజులపల్లెకు చెందిన నలుగురు దివ్యాంగులకు సోమవారం ట్రైసైకిళ్లను అందజేశారు. కౌన్సిలర్ మాట్లాడుతూ స్పెయిన్‌కు చెందిన ఫౌండేషన్ రోవివాల్లా వారి ఆర్థిక సహాయంతో ట్రైసైకిళ్లను అందించామని చెప్పారు. రాయలసీమ వికలాంగుల సంస్థ ఉపాధ్యక్షుడు పెద్దసంజీవరాయుడు, సోమయాజులపల్లె ఎంపీటీసీ రామయ్య పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

చాగలమర్రి: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని నంద్యాల జిల్లా రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర రావు తెలిపారు. ఆదివారం స్థానిక మల్లెవేముల చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అధిక లోడుతో వెళ్తున్న 3 వాహనాలు, అలాగే గతంలో జరిమానా చెల్లించని వాటికి మళ్లీ జరిమానా విధించినట్లు చెప్పారు.

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారికి అభిషేకాలు, నిత్యపూజల అనంతరం పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారికి చీర, సారె, పిండి వంటలు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

గద్దర్ మృతికి సంతాపం

నంద్యాల(న్యూటౌన్): ప్రజాగాయకుడు గద్దర్ ఆదివారం గుండెపోటుతో మరణించడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివయ్య, గౌరవాధ్యక్షులు బాల ఓబయ్య, జయరాజ్ తదితరులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, శ్రీనివాసులు, సీపీఎం నాయకులు రమేష్‌కుమార్, తోటమద్దులు, బాలవెంకట్, ప్రజానాట్య మండలి కళాకారులు బాలహుసేన్, , సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి శంకర్, చౌడప్ప, రఫీ సంతాపం తెలిపారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల లయన్స్‌క్లబ్ కార్యాలయంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం క్లబ్ సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సభ్యులు ఆంజనేయులు గుప్త, నాగరాజు, చంద్రశేఖర్, రవిప్రకాష్, బాబురావు, చంద్రమోహన్, యూసుఫ్, సాయి పాల్గొన్నారు.

ఫేస్ యాప్ యంత్రాలు సరఫరా చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరుకు అవసరమైన యంత్రాలను ప్రభుత్వం సరఫరా చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాధవస్వామి కోరారు. స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో జిల్లా జనరల్ సెక్రటరీ సుబ్బన్న అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. మాధవస్వామి మాట్లాడుతూ జీవో 117 రద్దుతో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదముందని, పెన్షన్‌కు సీపీఎస్ రద్దు తప్ప వేరే మార్గం లేదన్నారు. నాయకులు జమాన్, ప్రసాద్, శివయ్య, శ్రీనివాసులు, చంద్రశేఖర్, దస్తగిరి, లింగన్న, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే ధ్యేయం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(సిటీ): పట్టణాభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 8వ వార్డు తోట లైన్‌లో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రాధాన్యత క్రమంగా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. ఇంత చేస్తున్నా ప్రతి పక్ష టీడీపీ నాయకులకు కనపించడం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, వార్డు కౌన్సిలర్ తౌహిద్, వార్డు ఇన్‌చార్జ్ పఠాన్ నిజమాఖాన్, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ అండ



ఎమ్మెల్యే శిల్పాకు వినతి పత్రం ఇస్తున్న ఆర్‌ఎంపీలు

నంద్యాల టౌన్: గ్రామీణ వైద్యులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక శోభ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా నూతన కమిటీ ఎన్నికకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం జరిగిన ఎన్నికలో సంఘం అధ్యక్షుడిగా నాగేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సురేష్ బాబు, కోశాధికారిగా బేతంచెర్ల నాగ సురేంద్ర, ఏడుగురు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, 35 మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం జీవో 429 ని పునరుద్ధరించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. ఆర్‌ఎంపీ డబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు రాధాకష్ణ, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రాజు, పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కారం



పిచ్చిమొక్కలు తొలగించి దారి ఏర్పాటు చేసిన దృశ్యం

రుద్రవరం: మండలంలోని చిత్రేనిపల్లె ఎస్సీ కాలనీలో దారి సమస్య పరిష్కారమైంది. ఎన్నో ఏళ్లుగా దారిలేక ఇబ్బంది పడుతున్న తమకు సర్పంచ్ విజయలక్ష్మి దారి ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించడం హర్షణీయమన్నారు. చిత్రేనిపల్లె ఎస్సీ కాలనీ శివారులో పంటపొలాలు ఉండేవి. పొలాలకు, కాలనీకి మధ్యలో దారి పిచ్చి మొక్క, ముళ్ల పొదలతో మూసుకుపోయింది. వర్షాకాలంలో విషపురుగులు కాలనీలోకి వచ్చేవి, దీంతో సమస్యను పరిష్కరించాలని గతంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం కాలనీ వాసులు తమస్యను సర్పంచ్ వరలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించి దారిని ఏర్పాటు చేశారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్ చేర్చాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రపతి ఉత్తర్వులు 1975 సవరణ ప్రతిపాదనలో టీచర్ల ఉమ్మడి సర్వీస్ రూల్స్ అంశాన్ని చేర్చాలని ఫేసియల్‌యాప్ ప్రామాణికం కాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2022లో ఆంధ్రప్రదేశ్‌ను 26జిల్లాలుగా పునర్విభజన చేసిన నేపథ్యంలో ఇప్పటికే ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వులు రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని, ప్రధానంగా మూడు దశాబ్దాలుగా ఉన్న పంచాయతీరాజ్, ప్రభుత్వ యాజమాన్యంలోని ఉపాధ్యాయులు ఉమ్మడి సర్వీస్ రూల్స్ ప్రతిపాదన చేర్చాలని కోరారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, యాజమాన్యాల్లోని ఉపాధ్యాయుల క్యాడర్లను లోకల్ క్యాడర్‌గా ఆర్గనైజింగ్ చేయడం వల్ల సమానమైన పదోన్నతులు, సౌకర్యాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ నియామకం జరిగినప్పటికీ అమల్లోకి రాలేదని, 11వ పీఆర్సీలో అసమానతలను సవరించాలన్నారు. అనంతరం ఇటీవల ఏపీటీఎఫ్ శాఖలో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్, స్వామినాదం, శ్రీరాములు, మల్లెల్ల పుల్లయ్య, భగవాన్, వెంకటరాముడు, సుబ్బరాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుందాం



మాట్లాడుతున్న శంకర్

నంద్యాల(న్యూటౌన్): క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం.. దేశాన్ని రక్షించుకుందామని కార్మిక కర్షక సదస్సులో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి శంకర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమణకుమారి పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో గౌస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బ్రిటీష్ పాలన కంటే మోదీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులు, కర్షకులు ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని, 44కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా కుదింపు చేసి పెట్టుబడి దారులకు, కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా కార్మికులు చేశారని అలాంటి నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు సిద్ధంగా కావాలని కోరారు. ఈనెల 8వ తేదీన నంద్యాల పట్టణంలో నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలన్నారు. ఎల్లయ్య, లక్ష్మణ్, బాలవెంకట్, చౌడప్ప, తిరుపతయ్య, రామచంద్రుడు పాల్గొన్నారు.

శ్రీశైలంలో సామాన్య భక్తులకు పెద్దపీట

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఉభయ దేవాలయాల్లో జరిగే అన్ని ఆర్జితసేవల్లో సామాన్య భక్తులకు పెద్దపీటవేస్తూ సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఈఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం మహామంగళహారతి ప్రారంభ సమయం నుంచే భక్తులను దర్శనానికి అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి మంగళవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు ఉచిత స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే భక్తులు సులభంగా సేవా టికెట్లను పొందేందుకు మే నెల నుంచి అన్ని ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టామని, ఇటీవల దేవస్థానం యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అంతేకాకుండా తెల్లరేషన్ కార్డు కలిగిన సామాన్య భక్తులు నెలలో ఒకరోజు ఉచిత సామూహిక సేవ జరిపించుకునే అవకాశాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు.